వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 98
పేజీలు : 08 | వెల: రూ.5/-
శనివారం
జనవరి 04, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




## దొంగ సర్టిఫికెట్ తో ప్రభుత్వ ఉద్యోగం

- విచారణ జరిపి క్రిమినల్ కేసు నమోదు చేయాలి
- కలెక్టర్ కు లంబాడి హక్కుల పోరాట సంఘం వినతి

2లో..



# మునుపటి ఛరిష్మా వచ్చేనా..!

- బీసీ నినాదం ఎత్తుకున్న బీఆర్ఎస్
- స్థానిక ఎన్నికలే లక్ష్యంగా రాజకీయం
- సవాళ్లు విసురుతున్న నేతలు
- లేకుంటే పార్టీ మనుగడ కష్టమంటున్ననేతలు

ఉద్యమ పార్టీ అయిన తమకు తెలంగాణలో తిరుగులేదని విర్రవీగిన బీఆర్ఎస్ ను అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కర్రు కాచి వాత పెట్టారు. అధికారం కోల్పోయిన బీఆర్ఎస్కు ఇప్పుడు ఎదురుదాడి రాజకీయాలు తప్ప మరోటి కానరావడం లేదు. వివిధ అవినీతి కేసులతో పార్టీ పరువు బజారున పడుతున్న వేళ ఆ పార్టీ నేతలు ఆత్మరక్షణలో పడ్డారు. కేసులనుంచి బయట పడేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ఇదే సమయంలో పార్టీలో ఉన్నవారు ఇతర పార్టీలోకి జారుకోకుండా కసరత్తులు చేస్తున్నారు. ఇప్పటికే పార్టీని వీడిన వారిని కోర్టుకు లాగేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే రానున్న స్థానిక ఎన్నికల్లో గెలిస్తే తప్ప బీఆర్ఎస్ మనుగడ కష్టమని ఆ పార్టీ పెద్దలు భావిస్తున్నారు. లేకుంటే ఇప్పుడున్న పరిస్థితి కన్నా దారుణంగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. అందుకే ఆ పార్టీ నేతలు బీసీ నినాదాన్ని ఎత్తుకున్నారు. ఈ నినాదంతోనైనా ప్రజల్ని మళ్లీ ఉద్యమ స్థాయిలో సిద్ధం చేసి బీఆర్ఎస్ వైపు తిప్పకోవాలని పట్టుదలగా ఉన్నారు. పార్టీకి మునుపటి ఛరిష్మా తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారు. అయితే అధికారంలో ఉన్న పది సంవత్సరాల్లో ఏనాడూ బీసీలను పట్టించుకోని బీఆర్ఎస్ పార్టీ నేతలు నేడు మొసలి కన్నీరు కారుస్తూ స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కలిపించాలంటూ నిరసనలకు దిగడం, చాలెంజ్ లు విసరడం విడ్డూరంగా ఉందంటూ కాంగ్రెస్ పార్టీ ఎదురుదాడి చేస్తోంది.

-వరంగల్ వాయిస్, వరంగల్ ప్రతినిధి

వివరాలు2లో..

## అక్రమ అనుమతిని రద్దు చేయాలి

### కలెక్టర్ ను కోరిన ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య



ఆజంజాహి మిల్ కార్మికుల సంక్షేమం కోసం నిర్మించిన కార్మిక భవన్ ప్రాంతంలో ప్రైవేట్ వ్యక్తులకు అక్రమంగా ఇచ్చిన భవన నిర్మాణ అనుమతి, ఇంటి నంబర్ ను రద్దు చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదను ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, 20 డివిజన్ కార్పొరేటర్ గుండేటినరేంద్ర కుమార్ కోరారు. శనివారం కలెక్టరేట్ లో ఆమెను కలిసి వరంగల్ నగరానికి చెందిన కార్మిక మిల్లు భవనం స్థలంలో ఎటువంటి పర్మిషన్ ఇవ్వొద్దని, ఇచ్చినటువంటి పర్మిషన్ ను రద్దు చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. కూల్చి వేసిన కార్మిక భవన్ ప్రాంతంలోనే కొత్త కార్మిక భవన్ ను నిర్మించాలని కోరారు. ఇందుకుగాను తక్షణమే తగు చర్యలు తీసుకోవాలన్నారు.

– వరంగల్ వాయిస్, కాశిబుగ్గ




# మునుపటి ఛరిష్మా వచ్చేనా..!



- బీసీ నినాదం ఎత్తుకున్న బీఆర్ఎస్
- స్థానిక ఎన్నికలే లక్ష్యంగా రాజకీయం
- సవాళ్లు విసురుతున్న నేతలు
- లేకుంటే పార్టీ మనుగడ కష్టమంటున్ననేతలు

**వరంగల్ వాయిస్, వరంగల్ ప్రతినిధి :** అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలై ప్రతిపక్ష హోదాకే పరిమితమైన బీఆర్ఎస్ పార్టీ ఆత్మపరిశీలనో పడింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక బీఆర్ఎస్ కు చెందిన పలువురు ముఖ్యనేతలు కారు దిగి హస్తం గూటికి చేరారు. మరి కొందరు పార్టీతో అంటీ ముట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు బీఆర్ఎస్ కు అగ్నిపరీక్షగా మారనున్నాయి. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. లేకుంటే పార్టీ మనుగడ కష్టమని భావిస్తుస్తోంది. పార్టీని మళ్లీ విజయ తీరాలకు చేర్చాలంటే బీసీ నినాదం ఒక్కటే కలిసొచ్చేదిగా భావిస్తున్నారు. అందుకే బీసీ నినాదాన్ని ఎత్తుకున్నారు.

**మళ్లీ ఉద్యమ స్థాయిలో..**

ప్రజల్ని మళ్లీ ఉద్యమ స్థాయిలో సిద్ధం చేయాలని కేటీఆర్ పట్టుదలగా ఉన్నారు. జనాల సమస్యలను దృష్టిలో పెట్టుకుని వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావులే అడపాదడపా జనంలోకి వెళ్తున్నారు. పార్టీకి మైలేజీ తెచ్చేందుకు అప్పుడప్పుడు ఉద్యమం నాటి కేసీఆర్‌ను తిరిగి చూస్తారంటూ ప్రకటనలు చేస్తున్నారు. ఎన్నికల తర్వాత రాష్ట్రంలో గందరగోళం ఏర్పడుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఉండబోదంటూ ప్రచారాలను మొదలు పెట్టారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అమలు చేసిన పథకాలతో ప్రజల్లోకి వెళ్లేలా ప్రచార కార్యక్రమాలను బీఆర్ఎస్ సిద్ధం చేస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితిని చూస్తుంటే బీఆర్ఎస్ నాయకులను జనాలు పెద్దగా పట్టించుకుంటున్నట్లు కనిపించడం లేదు. క్యాడర్ సహకారం లేకపోవడంతో నేతలు నిమిత్త మాత్రులుగా మగిలిపోతున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కూడా విజయం సాధిస్తామన్న అంచనాలు తలకిందులు అయ్యాయి. దీంతో కారు క్యాడర్‌లో నిరూత్సాహం ఆవహించింది. దాన్ని పోగొట్టే ప్రయత్నంలో కేటీఆర్ పలు మీటింగ్‌లు పెట్టినా పెద్దగా ఫలితం రావడం లేదు.

**బీఆర్ఎస్ మైండ్ గేమ్..**

కాంగ్రెస్ ప్రభుత్వం కూలే సూచనలు ఉన్నట్లు చెబుతున్నారు. 104 మంది ఎమ్మెల్యేలు ఉంటేనే బీజేపీ తన ప్రభుత్వాన్ని కూల్చే ప్రయత్నం చేసిందని, 64 స్థానాలున్న కాంగ్రెస్ ను కూల్చడం వారికి పెద్ద కష్టం కాదంటూ సూత్రీకరిస్తున్నారు. కేటీఆర్, హరీశ్ రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు లాంటి సీనియర్ బీఆర్ఎస్ నేతలు కొద్ది రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూలుతుందని, రేవంత్ రెడ్డి బీజేపీలో చేరడం ఖాయమంటూ ప్రచారం మొదలుపెట్టారు. ఇదంతా చూస్తుంటే పార్టీ క్యాడర్ ను , లీడర్లను కాపాడుకునేందుకు బీఆర్ఎస్ నేతలు ఆడుతున్న మైండ్ గేమ్ గా రాజకీయ ప్రముఖులు అభివర్ణిస్తున్నారు.

**ఎదురుదాడి..**

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణను అప్పులకుప్పగా మార్చారు. అప్పులకు వడ్డీలు కట్టుకునే దుస్థితి ఇప్పుడు కాంగ్రెస్ కు చుట్టుకుంది. రైతుబంధు పేరుతో వేలకోట్లు దోచిపెట్టారు. ధరణి పేరుతో భూములన్నీ మాయం చేశారు. కాళేశ్వరంతో ప్రజాధనం వృధా చేశారు. ఇవన్నీ కూడా కళ్ల ముందు కనిపిస్తున్నాయి. కానీ ఇప్పుడు వాటిని వదిలి ఎదురుదాడి చేయడం, విమర్శలు చేయడం బీఆర్ఎస్ నేతలు అలవాటుగా చేసుకున్నారు. బీసీల గురించి కవిత తదితరులంతా గగ్గోలు పెడుతున్న తీరు ప్రజల్లో అసహ్యం కలిగిస్తోంది. పదేళ్ల పాలనలో సర్వ వ్యవస్థలను భ్రష్టు పట్టించిన బీఆర్ఎస్ కుటుంబం ఇప్పుడు నీతి వాక్యాలు వల్లిస్తోంది. రానున్న స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కలిపించాలంటూ ఎమ్మెల్సీ కవిత ఏకంగా నిరసన దీక్షకే దిగారు. బీసీలను ఒక్కతాటి మీదకు తీసుకొచ్చేందుకు పాట్లు పడుతున్నారు. నేను చెప్పేవి అబద్దాలైతే రాజకీయాలనుంచి తప్పుకుంటానంటూ కవిత సవాళ్ చేస్తోంది. అయితే ఆమెపై కాంగ్రెస్ నేతలు సైతం ఎదురు దాడికి దిగుతున్నారు. పదేళ్లు అధికారంలోనే ఉండి ఏమి చేశారంటూ కాంగ్రెస్ నేతలు సూటిగా ప్రశ్నిస్తున్నారు. అధికారం కోల్లోగానే బీసీలు గుర్తుకొచ్చారా అంటూ నిలదీస్తున్నారు.

**మైత్రి కుదిరేనా..**

అయితే కాంగ్రెస్ పార్టీ కూలుతుందంటూ బీజేపీ–బీఆర్ఎస్ నేతలు చెప్పడం రానున్న రోజుల్లో ఈ రెండు పార్టీల మైత్రికి ఇది నాందిగా మారుతుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బీజేపీకి ప్రధాన శత్రువు జాతీయ స్థాయిలో కాంగ్రెస్ మాత్రమే. బీఆర్ఎస్ జాతీయ పార్టీగా రిజిస్టర్ అయినా దాని ప్రభావం జాతీయ రాజకీయాల్లో ఏ మాత్రం లేదు. కాబట్టి దక్షిణాది రాష్టాల్లో కాంగ్రెస్ కన్నా ప్రాంతీయ పార్టీలు ఉంటేనే బీజేపీకి లాభం. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు–మిత్రులు ఉండరన్న నానుడి బీజేపీ–బీఆర్ఎస్ కు వర్తిస్తుంది. అదే రీతిలో శత్రువు–శత్రువు మిత్రువు అన్న నానుడి కూడా ఈ రెండు పార్టీలకు వర్తిస్తుంది. ఎందుకంటే.. జాతీయ స్థాయిలో బీజేపీకి శత్రువు కాంగ్రెస్, రాష్ట్ర స్థాయిలో బీఆర్ఎస్ కు శత్రువు కాంగ్రెస్. ఈ సూత్రం ప్రకారం బీజేపీ–బీఆర్ఎస్ లు రెండూ ఏకమై రానున్న రోజుల్లో కాంగ్రెస్‌ను గద్దె దింపే ప్రయత్నాలు చేసే అవకాశం లేకపోలేదు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలను ఈ రెండు పార్టీలు చేర్చుకుంటాయా లేక, బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ చేర్చుకుని కౌంటర్ ఎటాక్ చేస్తుందా... అన్నది మాత్రం వేచిచూడాల్సిందే.

# కనీస వేతనం రూ.26 వేల చెల్లించాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్
- మున్సిపల్ కార్మికుల 48 గంటల దీక్షలు ప్రారంభం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించి పర్మినెంట్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ వరంగల్ నగరపాలక సంస్థ కమిటీ ఆధ్వర్యంలో 48 గంటల దీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ దీక్షలను సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. 2016 లో సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని తీర్పు చెప్పినా ఇప్పటివరకు దానిని అమలు చేయడం లేదని ఆరోపించారు. ప్రజా ప్రతినిధులు తమ వేతనాలను లక్షల్లో పెంచుకుంటున్నారు తప్ప కార్మికులకు వేతనాలను పెంచడంలో చిత్తశుద్ధిని ప్రదర్శించడం లేదని రమేష్ విమర్శించారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలో మున్సిపల్ కార్మికుల ప్రాధాన్యం కీలకమైందని అలాంటి వారిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని మండిపడ్డారు. తక్షణమే అందరినీ క్రమబద్ధీకరించాలని ఆయన డిమాండ్ చేశారు.

**కార్మికులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి**

**: సీపీఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి**

ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల దీక్షలకు సంఘీభావం తెలిపిన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులకు పీఆర్సీలో నిర్ణయించిన మినిమం బేసిక్ పేని వేతనంగా చెల్లిస్తున్న ఆనవాయితీ ఉంది కానీ గత ప్రభుత్వం జీవో నెంబర్ 60 ప్రకటించినప్పటికీ జీవోలో పేర్కొన్న కేటగిరీల వారీగా మున్సిపల్ కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదని ఆరోపించారు. తక్షణమే దానిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. వరంగల్ నగరపాలక సంస్థలో పనిచేస్తున్న 452 మంది కార్మికులకు, మలేరియా హార్టికల్చర్ కార్మికులకు రూ.16,500 తక్షణమే అమలు చేయాలని, జవాన్ లందరికీ రూ.19 వేల వేతనం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కేవీపీఎస్ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద సంపత్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ దీక్ష కార్యక్రమంలో సీఐటీయూ మున్సిపల్ యూనియన్ నాయకులు టి.ఉప్పలయ్య, బరుపట్ల మహేష్, జన్ను ప్రకాష్, సింగారపు బాబు, ఎస్.కృష్ణ, యాస బాబు, ఎం.నవనీత, కోటేశ్వర్, సుశీల్, మైదం కుమార్, సంఘాల రాజు, రంజిత్, ఎర్ర నగేష్, పాపయ్య, సుజాత, ప్రభ, సువర్ణలతో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

# దొంగ సర్టిఫికెట్ తో ప్రభుత్వ ఉద్యోగం

- విచారణ జరిపి క్రిమినల్ కేసు నమోదు చేయాలి
- కలెక్టర్ కు లంబాడి హక్కుల పోరాట సంఘం వినతి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఎస్టీ లంబాడి కులం పేరుతో దొంగ సర్టిఫికెట్లు సృష్టించి ప్రభుత్వ ఉద్యోగిగా చలామణి అవుతున్న గోపు స్వర్ణలతపై విచారణ జరిపి క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరుతూ హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్యకు లంబాడి హక్కుల పోరాట సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీర వెంకట్ నాయక్ ఆధ్వర్యంలో విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవేండి గ్రామానికి చెందిన గోపు బాలశౌర్ రెడ్డి 1963 లో కడవేండి చర్చిలో గోపు సుశీలను వివాహం చేసుకున్నారు. వారికి హేమలత, స్వర్ణలత ఇద్దరు కూతుర్లు. గోపు సుశీల వ్యక్తిగత కారణాలతో ఇద్దరు కూతుర్లతో ఖాజిపేటకు వచ్చి ఫాతిమా నగర్ లో కిరాయి ఉంటూ జీవనం సాగిస్తోంది. అనంతరం గోపు సుశీల భూక్యా అంకుష్ వీధిలో ఇల్లు కిరాయికి తీసుకొని ఉంటూ ఆయనతో స్నేహంగా మెగిలారు. అయితే రఘునాథ్ పల్లి స్కూల్ లో గోపు స్వర్ణలత చదివినప్పుడు తండ్రి పేరు గోపు బాలశౌర్ రెడ్డిగా పేర్కొన్న సుశీల ఫాతిమా గర్ల్స్ హై స్కూల్ లో మాత్రం తండ్రి పేరును భూక్యా అంకుష్ అంటూ తప్పుగా నమోదు చేశారని ఆరోపించారు. అప్పుడే స్వర్ణలత పేరు మీద రెవెన్యూలో ఎస్పటీ సర్టిఫికెట్ పొంది అక్రమ మార్గంలో రిజర్వేషన్ పొంది చదువు పూర్తి చేశారని, తర్వాత అదే సర్టిఫికెట్ తో ప్రభుత్వ ఉద్యోగంలో చేరి అందరినీ మోసం చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై తగు విచారణ చేసి కులాన్ని తప్పుగా రికార్డుల్లో చూపిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే అమెకిచ్చిన ఎస్టీ సర్టిఫికెట్ రద్దు చేయాన్నారు. లేకుంటే లంబాడా హక్కుల సంఘం ఆధ్వర్యంలో పోరాట కార్యక్రమాలు చేపడతామని కలెక్టర్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షులు లావుడియా శ్రీనివాస్ నాయక్, సురేష్ నాయక్, గోవింద నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమి ఆక్రమణ

- 107 సర్వే నెంబర్ లో 1.34 గుంటలు కబ్జా
- రూ.1000 కోట్ల విలువ చేసే భూమి
- నిద్రమత్తులో అధికారులు, ప్రజాప్రతినిధులు

పట్టణంలోని 107 సర్వే నంబర్ లో 1.34 గుంటల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది. రూ.1000 కోట్ల ప్రభుత్వ భూమిని దర్జాగా అక్రమిస్తే అధికారులు, ప్రజాప్రతినిధులు నిద్రమత్తులో జోగుతున్నారు. సర్వేనెంబర్ 110లో, 106 లో ప్రైవేట్ వ్యక్తుల భూములతో పాటు గ్రీన్ ల్యాండ్ భూములను కూడా ఆ బడా చోర్ ఆక్రమించుకున్నాడంటేనే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చరు. ఏకంగా రూ.1000 కోట్ల ప్రభుత్వ భూమిని ఓ బడా వ్యాపారి ఎంచక్కా ఆక్రమించుకొని చక్రం తిప్పుడుతున్నాడు. అయితే ఈ బడా చోర్ కు స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులే సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నారు. ఈ భూ కబ్జాపై శనివారం తహసీల్దార్ కు ఎల్ హెచ్ పీఎస్ లంబాడి హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు భీమా నాయక్ వినతి పత్రం అందజేసిన భూములను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు.

**- వరంగల్ వాయిస్, మహబూబాబాద్**

### బడా చోర్ పై పీడీ యాక్ట్ విధించాలి..

రూ.1000 కోట్ల భూమిని కబ్జా చేసిన ఆ బడా చోర్ ఆనాడు అధికార బీఆర్ఎస్ పార్టీకి తొత్తుగా ఉండి, నేడు కాంగ్రెస్ సానుభూతి పరుడుగా మారాడు. మహబూబాబాద్ పట్టణం కేంద్రంలోని 107 సర్వే నెంబర్ లో 1.34 ఒక ఎకరం 34 గుంటల భూమిని దర్జాగా కబ్జా చేసి, ప్రభుత్వానికి రావలసిన ఆదాయాన్ని కొల్లగొట్టి గత 30 సంవత్సరాల నుంచి అనుభవిస్తున్న ఆ బడా చోర్ ను తక్షణమే పీడీ యాక్ట్ అమలు చేసి జైలుకు పంపాలని ఎల్ హెచ్ పీఎస్ నేత గుగులోతు భీమా నాయక్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ నడిరోడ్డుని ఆనుకొని ఉన్న 1.34 గుంటలలో కోట్ల రూపాయల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని, ఆ భూమిలో రైస్ మిల్లు, షాపింగ్ కాంప్లెక్స్ దర్జాగా కట్టుకొని, నెలకు కిరాయి ఒక కోటి రూపాయల వసూలు చేస్తూ ప్రభుత్వాన్ని మోసం చేస్తున్న అతడిని గుర్తించి తక్షణమే ప్రభుత్వం ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలన్నారు. అప్పటి కలెక్టర్ కూల్చివేతకు ఆదేశాలిచ్చారు. అయినప్పటికీ ఆ బడా చోర్ తన పలుకుబడి ఉపయోగించడంతో అధికారులు మిన్నకుండిపోయారు.



### సామన్యులపై జులుం.. పెద్దలకు గులాం..

సామాన్యులు పేదలు, జానెడు జాగలో గుడిసెలు వేసుకుంటే గుడిసెలు కూల్చడానికి చేతులు వస్తాయి, కానీ ఇలాంటి బడా చోర్ దర్జాగా కబ్జా చేస్తే అధికారుల చేతులు ఎందుకు రావడం లేదని సామాన్య ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తక్షణమే ఈ భూమిపై విచారణ జరిపించి ప్రభుత్వం భూమిని స్వాధీనం చేసుకోవాలని, లేకుంటే లంబాడి హక్కుల పోరాట సంఘం ఆధ్వర్యంలో ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా తీసుకెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎల్ హెచ్ పీఎస్ జిల్లా సలహాదారుడు బానోత్ విష్ణు నాయక్, డోర్నకల్ నియోజకవర్గ ఇంచార్జి మంగీలాల్ నాయక్, ఎల్ ఎస్ఓ జిల్లా అధ్యక్షుడు శివ వర్మ నాయక్, వికలాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రాందాస్ నాయక్, బాలు నాయక్, మానుకోట పట్టణ ఇంచార్జి సోమాజి నాయక్, జిల్లా నేతలు శ్రీను నాయక్, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు జవహర్ లాల్ నాయక్, విద్యార్థి విభాగం ఎల్ ఎస్ఓ ఉపాధ్యక్షుడు వెంకటేష్ నాయక్, భూక్య రవి నాయక్, గార్ల మండల ఇంచార్జి రమేష్ నాయక్, సుధాకర్ నాయక్, వీరన్న నాయక్, భూక్యా రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రపంచ బ్యాంకు దగ్గర వేల కోట్ల అప్పులు తీసుకురావడం కంటే.. భూకబ్జాదారులను బొక్కలో వేస్తే తెలంగాణ రాష్ట్ర అప్పులు మొత్తం తీరుతాయని, తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు అవ్వాలంటే రాష్ట్రంలో ఇలాంటి కబ్జాదారుల లిస్టు రాష్ట్రం మొత్తం తీయండని రేవంత్ రెడ్డిని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇలా చేస్తే మరో 25 ఏళ్లు మీరే సీఎంగా కొనసాగుతారని అంటున్నారు. (అంటే ఏ పార్టీ అధికారం లోకి వస్తె ఆ పార్టీలో చేరుతాడువేల కోట్ల ప్రభుత్వ భూములు అన్యక్రాంతమవుతున్నాయని అసెంబ్లీలో మొత్తుకునే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అతగాడిపై చర్యలకు అనుమతి ఇస్తారా లేదా అనేది వేచి చూడాలి.**

# ఎంసీపీఐ(యూ)లో వర్కర్స్ పార్టీ విలీనం




**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ మద్ది కాయల అశోక్ సమక్షంలో ఎంసీపీఐ(యూ) లో వర్కర్స్ పార్టీని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాయబండి పాండురంగా చారి శనివారం విలీనం చేశారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ఎంసీపీఐ(యూ)కండువా కప్పి ఆహ్వానించారు. శనివారం హైదరాబాద్ ఓంకార్ భవన్ ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యాలయంలో వర్కర్స్ పార్టీని రద్దు చేసుకొని ఎంసీపీఐ(యూ) విలీనం చేస్తున్నట్లు వర్కర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాయబండి పాండురంగాచారి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ మద్ది కాయల అశోక్ ఓంకార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వనం సుధాకర్, కుంభం సుకన్య, వి.తుకారాం నాయక్ పాల్గొన్నారు. తొలుత వర్కర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ రాయబండి పాండురంగాచారికి పార్టీ కండువా ను కామ్రేడ్ అశోక్ ఓంకార్ కప్పి ఎంసీపీఐ(యూ) లోకి ఆహ్వానించారు. ఈ చేరికల్లో వర్కర్స్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు వడ్ల అరుణ, వర్కర్స్ పార్టీ ఇబ్రహీం పట్నం నియోజకవర్గం ఇంచార్జి ఉనుకుంట్ల మురళికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది.

# ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మంద కొమురమ్మ నగర్ కాలనీలో లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా వీహెచ్ పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎండీ పాషా అధ్యక్షతన ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా వీహెచ్ పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి, వరంగల్ ఉమ్మడి జిల్లా ఇంచార్జి గడ్డం కాశిం, ఎంఎస్పీ జాతీయ నాయకులు, జిల్లా ఇంచార్జి గుగ్గిళ్ల పీరయ్య మాదిగ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలో అంధులకు వెలుగు నింపిన గొప్ప మహానుభావుడు లూయిస్ బ్రెయిలీ, ఆయన రచించిన విధానాన్ని అంధులు ప్రపంచానికి చాటి చెప్పాలని, అదేవిధంగా అంధులకు అక్షరాన్ని అందించి వికలాంగులకు గొప్ప దేవుడిగా ఉన్నాడని అందరూ లూయి బ్రెయిలీ ఆలోచన విధానాన్ని పుణికి పుచ్చుకొని ప్రజా పోరాటం, హక్కుల కోసం పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో వీమెచ్ పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్బూరి వినోద్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చలగోల వెంకన్న, మహిళా జిల్లా అధ్యక్షురాలు



మంజుల, జిల్లా అధికార ప్రతినిధి భూక్యా వెంకన్న, జిల్లా ఉపాధ్యక్షుడు జెరిపోతుల నారాయణ, జిల్లా కార్యదర్శి బైగల్ల సహదేవుడు, కోశాధికారి కొండా వెంకటేశ్వర్లు, జిల్లా సహాయ కార్యదర్శి రుద్ర తిరుపతి, జిల్లా నాయకులు కొట్టెం వెంకటేశ్వర్లు, జిల్లా బుడిగ శ్రీరాములు, గుర్రం ప్రభాకర్, దొంతు వెంకన్న, శ్రావణ్, చెవుల వెంకన్న, జలేంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**వరంగల్ వాయిస్. శాయంపేట :** మండలంలోని తహరాపూర్ గ్రామంలో రేణిగుంట్ల రాజమ్మ, శాయంపేటలో సీనియర్ జర్నలిస్ట్ బాల్నె తిలక్ బాబు, బాసని కైలాసం, అబ్బు భాస్కర్ రెడ్డిలు ఇటీవల మృతి చెందగా శనివారం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి, నాయకులు గాజె రాజేందర్, వలపదాసు చంద్రమౌళి, రామ్ శెట్టి లక్ష్మారెడ్డి, దైనంపెల్లి సుమన్, గంట శ్యాంసుందర్ రెడ్డి, మేరకుర్తి కరుణాకర్, రమేష్, మారేపల్లి మోహన్, కరణ్ బాబు, కొమ్ముల రాకేష్, ఎండీ రాజు మహ్మద్ తదితరులు ఉన్నారు.

# ఎస్సైని కలిసిన బీఆర్ఎస్ నాయకులు




**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలానికి నూతనంగా వచ్చిన ఎస్సై జక్కుల పరమేష్ ను శనివారం బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డితో పాటు బీఆర్ఎస్ నాయకులు లత –లక్ష్మారెడ్డి, గంట శ్యాంసుందర్ రెడ్డి, మలపదాస్ చంద్రమౌళి, మారపల్లి నందం, మారపల్లి మోహన్, కరుణ్ బాబు, సంజీవరావు, పాపారావు, రవీందర్ రెడ్డి, ఆదిరెడ్డి, కొమ్ముల రాకేష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# కుంకుమేశ్వర ఆలయ చైర్మన్ గా కొల్లూరి రాజేశ్వరరావు



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని కుంకుమేశ్వర ఆలయ చైర్మన్ గా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొల్లూరి రాజేశ్వరావును నియమించారు. ఇందులో భాగంగా ఒక చైర్మన్ ఆరు డైరెక్టర్లలను ప్రకటించడం జరిగింది. డైరెక్టర్లుగా డాక్టర్ సరోజనా దేవి, కే.శ్రీధర్, టి రవీందర్, జి.సంధ్య, స్వాల్ రామ్, జి.నవీన్ లుగా నియామకమయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ తమ నియమాకానికి సహకరించిన పరకాల ఎమ్మెల్యేకు, కాంగ్రెస్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మేము అన్ని విధాల టెంపుల్ డెవలప్ చేస్తామని హామీ ఇచ్చారు. చైర్మన్ గా నియమితులైన కొల్లూరి రాజేశ్వరరావును పరకాల ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కోయడ శ్రీనివాస్, మీడియా కన్వీనర్ దారుణ వేణు, పసుల నాగరాజు, దుబాసి వెంకటస్వామి, రవి, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎరువుల దుకాణాల్లో తనిఖీ



**వరంగల్ వాయిస్ పరకాల :** మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ శనివారం పరకాల పట్టణంలోని పలు ఫర్టిలైజర్స్ షాపులను ఆకస్మిక తనిఖీ చేశారు. ఎరువులు, పురుగు మందులకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ అయిపోయి రబీ సీజన్ మొదలవుతున్న నేపథ్యంలో రైతులకు ఎరువుల కొరతను నియంత్రించే నేపథ్యంలో హనుమకొండ జిల్లా పరకాల పరిధిలోని అలాట్ మెంట్ అయిన ఎరువులను ఇతర జిల్లాలకు హోల్ సేల్ లో అమ్మకూడదని ఫర్టిలైజర్ షాప్ యజమానులను హెచ్చరించారు. రైతులు తప్పకుండా ఎరువులు కొనుగోలు చేసే సమయంలో ఆధార్ కార్డుతో కొనుగోలు చేసుకోవాలని కోరారు.

# విద్యార్థులకు నోటు బుక్స్ పంపిణీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** లయన్స్ క్లబ్ ఆఫ్ వరంగల్ పోతన లీడర్ షిప్ చైర్మన్ డాక్టర్ లయన్ ఆడెపు రవీందర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల మాసూం వలీ, ప్రాథమిక పాఠశాల మౌలాలి ఎల్బీనగర్ లో విద్యార్థిని విద్యార్థులకు 600 నోటు పుస్తకాలు రవీందర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ పోతన అధ్యక్షులు జంగాధర్మా, మాజీ అధ్యక్షులు లకుం ఐలయ్య, కోశాధికారి చిలుకూరి కృష్ణ, ప్రధానోపాధ్యాయులు డాక్టర్ బీవీఎన్ స్వామి, జోసెఫ్, రాష్ట్ర పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు వడ్నాల నరేందర్, జిల్లా పద్మశాలి సంఘం నాయకులు మార్గం ఎల్లయ్య, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు శ్రీలత, సునీత, నవ్య, కనకయ్య, కమలాకర్, భిక్షపతి, డయాల శ్రీధర్చార్యులు, దేవేందర్, మోహన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# దాతృత్వం చాటుకున్న ఏకశిల ప్రైమ్ స్కూల్



**వరంగల్ వాయిస్, దామెర :** స్థానిక ఏకశిల ప్రైమ్ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఏకశిల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సహృదయ వృద్ధాశ్రమాన్ని సందర్శించి నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయం అందజేసి వారి దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. ఏకశిల విద్యాసంస్థల డైరెక్టర్ బేతి కొండల్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో సాటి మనిషికి సహాయం చేయాలనే నైతిక ప్రవర్తన, మానవతా విలువలు విద్యార్థి దశ నుంచే నేర్పించాలని, గతంలో కూడా ట్రస్ట్ తరపున చాలామందికి ఎన్నో విధాలుగా సహాయ సహకారాలు అందించామన్నారు. అందులో భాగంగానే మా ఏకశిల చారిటబుల్ ట్రస్ట్ తరపున విద్యార్థులతో కలిసి సహృదయ వృద్ధాశ్రమాన్ని సందర్శించామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ మణికుమార్, స్టాఫ్ ఇంచార్జి విజయ్ కుమార్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సత్తెమ్మ మృతికి వెంకట్రాములు సంతాపం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు ఉమ్మడి వరంగల్ జిల్లాలో వ్యవసాయ కార్మిక ఉద్యమ నిర్మాత అమరజీవి సింగు నరసయ్య సతీమణి సింగు సత్తెమ్మ ఇటీవల మహబూబాబాద్ లో అనారోగ్యంతో మృతి చెందడం అత్యంత బాధాకరమని, వారి మృతి పట్ల భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ,బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. వారి కుమారులైన శ్రీనివాస్ ,రమేష్ లకు కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. సత్తెమ్మ మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని, ప్రజా సంఘాల కార్యకర్తలకు ఉద్యమకారులకు వారు అందించిన తోడ్పాటు మరువలేనిదని జోహార్లు అర్పించారు. వారి ఆశయాల సాధనకు కృషి చేయడమే వారికి నిజమైన నివాళులు అర్పించినట్లు కాగలదన్నారు

# అధ్యక్ష పదవికి రాజీనామా



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** పర్వతగిరి మండల గ్రామ పంచాయితీ కార్యదర్శుల మండల అధ్యక్షుడు ఎండీ. మోహినొద్దీన్ తన పదవికి రాజీనామా చేశారు. వ్యక్తి గత కారణాల రీత్యా రాజీనామా చేశానని, ఇప్పటివరకు సహకరించిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

# బడి పిల్లలను కన్న బిడ్డల్లా చూసుకుంటున్న ప్రభుత్వం

**➡ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**



**వరంగల్ వాయిస్, గణపురం :** హాస్టల్ పిల్లలు చదువులో ఎదగడానికి రేవంత్ సర్కార్ ఆహారం ఆరోగ్యం తదితర ఎలాంటి కొరతలు లేకుండా రెట్టింపు నిధులిచ్చి వారిని కన్న బిడ్డల వలే ప్రేమగా చూసుకుంటుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలో శనివారం కస్తూర్బా, మోడల్ స్కూల్, బీసీ హాస్టల్ బాలబాలికలకు 300 మందికి పైగా దుప్పట్లను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి పంపిణీ చేసి మాట్లాడారు. మెస్ చార్జీలు 40%, కాస్మెటిక్ చార్జర్ 200% పెంచి ఇచ్చారన్నారు. గత పదేళ్ల కేసీఆర్ సర్కార్ హయాంలో ఒక రూపాయి కూడా పెంచకపోవడంతో హాస్టల్ బాలబాలికలు ఎన్నో ఇబ్బందులకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్లో, పాఠశాలల్లో ఇప్పుడు నాణ్యమైన, ఆరోగ్యకరమైన, ఖరీదైన, భోజనాన్ని తింటూ విద్యార్థులు సంబరపడుతున్నారని అన్నారు. గణపురంలోని మోడల్ కస్తూర్బా హైస్కూల్ కు ఇప్పటికే రూ.25 లక్షల పైగా నిధులు ఇచ్చి వివిధ అభివృద్ధి పనులు వేగంగా చేస్తున్నామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్, తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, కస్తూర్బా ప్రిన్సిపల్ లావణ్య, మోడల్ హై స్కూల్ ప్రిన్సిపల్ తిరుపతి, బీసీ బాలికల హాస్టల్ సిబ్బంది తదితరులతో పాటు కాంగ్రెస్ నాయకులు ఆర్ రాజేందర్, ఎండీ చోటే మియా, వి.అశోక్, కే శ్రీనివాస్, దుర్గయ్య, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# పెరిగిన ఇటుక ట్రాక్టర్ లేబర్, డ్రైవర్ల వేతనాలు



**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్ :** ఫోర్ట్ రోడ్డు ఏరియా లోని బ్రిక్స్ అండ్ ట్రాక్టర్ వర్కర్స్ యూనియన్, బ్రిక్స్ ఓనర్స్ అసోసియేషన్ కార్మిక నాయకులు యజమానుల మధ్య రేట్ల పెంపుపై నిన్న జరిగిన చర్చలు ఫలప్రదమయ్యాయి. ట్రాక్టర్ డ్రైవర్ కు గతంలో ఉన్న దానికంటే 1100 రూపాయలు నెలకు అదనంగా పెరిగింది. అలాగే సంవత్సరానికి ఒక నెల జీతం బోనస్ గా ఇవ్వడానికి యజమానులు అంగీకరించారు. ఇటుక లోడింగ్ అన్ లోడింగ్ చేసే కార్మికులకు గతంలో ఉన్న 800 రూపాయలకు గాను అదనంగా 60 రూపాయలు పెంచడానికి యజమానులు అంగీకరించారు. కార్మికుడు ఒక సంవత్సరం పాటు ఒకే యజమాని వద్ద పనిచేస్తే అతడికి యజమాని ఒక జత బట్టలు ఇస్తారు. ఇవే కాక జాతీయ సెలవులు పండుగ సెలవులతో పాటు అన్ని రకాల సంప్రదాయ హక్కులు కూడా కార్మికులకు ఉంటాయని వీరి మధ్య జరిగిన ఒప్పందంలో తెలిపారు. ఈ ఒప్పంద పత్రంపై యజమానుల తరపున ఎన్ శ్రీనివాస్, ఎంవీ కొండయ్య, బండి కోటేశ్వరరావు, ప్రభాకర్ నాయుడు, మల్లేశం, ఎండీ యాకూబ్, ముంతాజ్ లు పాల్గొనగా కార్మికుల తరపున ఐఎఫ్ టీయూ జిల్లా అధ్యక్షులు గంగుల దయాకర్, నగర కార్యదర్శి బన్న నర్సింగం, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, జిల్లా నాయకులు రాచర్ల బాలరాజు, యూనియన్ నాయకులు ఎర్ర జయ బాబు, ఉసిల్ల రాములు, చిదుల బాబు, సంతకాలు చేశారు. ఎండీ మన్నన్, ఎండీ ఆరిఫ్, బందెల రాజేందర్, గరిక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అజంజాహీ మిల్ కార్మిక భవన స్థలాన్ని కాపాడండి

**టీడీపీ నాయకుల డిమాండ్**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** సీఎం రేవంత్ రెడ్డి అజం జాహీ మిల్ కార్మిక భవన స్థలాన్ని కాపాడండి! అజంజాహీ మిల్స్ కార్మిక భవన స్థలాన్ని ప్రైవేటు వ్యక్తుల ఆక్రమణకు గురైనందున సీఎం ప్రత్యేక శ్రద్ధ చూపి అదే స్థలంలో కార్మిక భవనాన్ని నిర్మించే విధంగా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. 70 ఏళ్లుగా అజం జాహీ మిల్ వర్కర్లు వారి కార్యకలాపాలు నిర్వహించుకోవడానికి ఏర్పాటు చేసుకున్న భవనం అదని, గత బీఆర్ఎస్ పాలకులు కబ్జాదారులకు వకల్తా పలికి ఆ స్థలాన్ని కబ్జా చేయడం జరిగింది. ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, అప్పుడు ప్రతిపక్షంలో ఉండి కార్మికులకు అండగా నిలబడ్డారు. ఇప్పుడు అధికారంలో ఉండి కార్మికుల స్థలాన్ని కాపాడాల్సిన బాధ్యత మంత్రిపై ఉందని గుర్తు చేశారు. తక్షణమే మంత్రి కొండా సురేఖ, గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి కార్మికులకు అండగా నిలవాలని కోరారు. శనివారం అజం జాహి మిల్ కార్మిక భవన స్థలాన్ని తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి చిలువేరు రవీందర్, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర మాజీ కార్యదర్శి సింగారపు దేవేందర్, రాజు, తవుటం సంపత్, కాండ్రాతి రాజు, పోలేపాక సాయి కుమార్, సింగారపు మురళి, బజ్జూరి వీరేశం, శిరబోయిన రాజు ఉన్నారు.

# రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరికి రోడ్డు భద్రత ప్రమాణాలపై అవగాహన కల్పించేలా రోడ్డు భద్రత మాసోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హైదరాబాద్ నుంచి రోడ్లు భవనాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ తో కలిసి రోడ్డు భద్రత మాసోత్సవాల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, గతంలో కేంద్ర ప్రభుత్వం రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించేదని, దీని ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని నేడు రోడ్డు భద్రతా మాసోత్సవం చేపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతి శాఖను భాగస్వామ్యం చేస్తూ వినూత్నంగా ప్రజలకు చేరేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. రోడ్డు భద్రత ప్రమాణాల పై వేడుకలను ప్రతి గ్రామంలో జరగాలని అన్నారు. పిల్లల్లో రోడ్డు భద్రతా ప్రమాణాల పై అవగాహన కల్పించేందుకు ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. సంక్రాంతి సెలవుల తర్వాత విద్యార్థులచే ప్రతి జిల్లా , మండల హెడ్ క్వార్టర్ లో భారీ ర్యాలీ చేపట్టాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ నాథన్ కేకన్, అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.వీరబ్రహ్మాచారి, ఈఈ రోడ్లు భవనాల భీమ్లా నాయక్, రవాణా శాఖ అధికారి జైపాల్ రెడ్డి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ నరసింహస్వామి, జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రవీందర్ రెడ్డి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో ప్రమాద స్థలాలను గుర్తించాలని, రోడ్డు భద్రత మాస ఉత్సవాలపై క్షేత్రస్థాయిలో విద్యాసంస్థలు, బహిరంగ ప్రదేశాలు, డ్రైవర్స్ యూనియన్ స్వచ్ఛంద సంస్థలు, తదితరులతో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించేందుకు పక్క ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.

# ఫిబ్రవరిలో అందుబాటులోకి జీపీ భవనం

◆ శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్** : ధర్మసాగర్ మండలం రాయగూడెం గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈజీఎస్ నిధులతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనాన్ని ఫిబ్రవరి 15లోగా అందుబాటులోకి తేనున్నట్లు ప్రకటించారు. రోడ్డు కంటే కిందికి భవనం ఉన్నందున సెల్లార్ పైన గ్రామ పంచాయతీ భవనం ఉండే విధంగా ఇంజినీరింగ్ అధికారులు రీ ఎస్టిమేషన్ చేయాలని కడియం శ్రీహరి సూచించారు. అందుకు మరో రూ.10లక్షలు మంజూరు అయ్యే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా రాయగూడెం గ్రామానికి ఈ ఏడాది 50 ఇందిరమ్మ ఇల్లు మంజూరు ఇస్తానని వెల్లడించారు. ఈ నూతన సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ మీ అందరి ఆశీర్వాదం కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గుండేటి రాజేశ్వర్ రావు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఎస్సెస్సీ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

**వరంగల్ వాయిస్, నడికూడ** : నడికూడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సాహితి కళాశాల కరస్పాండెంట్ కందకట్ల రాజు రూ.5వేల విలువైన స్టడీ మెటీరియల్ ను అందజేసినట్లు పాఠశాల హెచ్ఎం కె.హనుమంతరావు తెలిపారు. ఈ సందర్భంగా భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు దొంతుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. స్టడీ మెటీరియల్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఎస్సెస్సీలో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుమలత, శివచేతన్, శ్రవణ్ కుమార్, తిరుపతి, సుబానీ, జ్యోత్స్న, శారద, శివకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

# దేశాభివృద్ధిలో విద్యార్థుల పాత్ర కీలకం

• డాక్టర్ పెండెం కృష్ణకుమార్



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్** : దేశాభివృద్ధి, పర్యావరణ రక్షణలో విద్యార్థుల పాత్ర కీలకమని డాక్టర్ పెండెం కృష్ణకుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్ఫూర్తిదాయక వ్యక్తుల పరిచయ కార్యక్రమ పరంపరలో భాగంగా ప్రతిష్టాత్మక గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును నాలుగు సార్లు పొందిన డాక్టర్ పెండెం కృష్ణకుమార్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతిభ, నైపుణ్యాలు, అన్వేషణ, సామర్థ్యాలు, గ్రామీణ ప్రభుత్వ విద్యా సంస్థల విద్యార్థుల్లో అపారంగా ఉన్నాయని, వాటిని సరైన రీతిలో సద్వినియోగం చేసుకుని సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా కళాత్మక నాటక రంగంలో 400 లకు పైగా విభిన్న పాత్రలు పోషించడం, టైపింగ్ అతి వేగంగా చేయడం వంటి అనేక అంశాలు విద్యార్థులకు ప్రదర్శించి వారిలో స్ఫూర్తిని నింపారు. ఈ సందర్భంగా కృష్ణకుమార్ రూ.25 వేల విలువ కలిగిన చరిత్ర నిర్మాణాన్ని గొప్ప స్థాయికి చేర్చిన దేశ నాయకులు, సంఘ సంస్కర్తలు, శాస్త్రవేత్తల చిత్రపటాలు, మెడికల్ కిట్టు, వాటర్ క్యాన్, వరల్డ్, ఇండియా, తెలంగాణ మ్యాప్స్, గోడ గడియారం, ఆట వస్తువులు, క్లాత్ బాగ్స్ కళాశాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అస్నాల శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ అధికారి మంజుల, అధ్యాపకులు అజం, బాబూరావు, యాకూబ్, రాములు, సదానందం, గోపాలకృష్ణ, వెంకట్, గణేష్, రాజేందర్, లావణ్య, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



## కానిస్టేబుల్ రాజుకు సావిత్రిబాయి పూలే అవార్డు

**వరంగల్ వాయిస్, మడికొండ** : మడికొండ పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న జి.రాజును సావిత్రిబాయి పూలే అవార్డుతో ఘనంగా సత్కరించారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా శుకవారం హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో సావిత్రిబాయి పూలే ఫౌండేషన్ నిర్వాహకురాలు సి.పరమేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాజుకు జ్ఞాపికను బహుకరించి శాలువా కప్పి సర్టిఫికెట్ అందజేశారు.

# ట్రాఫిక్ సమస్యలపై విద్యార్థులకు అవగాహన

ప్రోగ్రెస్ పాఠశాలలో ఏర్పాటు



**వరంగల్ వాయిస్, రెడ్డికాలనీ** : రెడ్డి కాలనీలోని ప్రోగ్రెస్ పాఠశాలలో డిస్ట్రిక్ట్ ట్రాన్స్ పోర్ట్ ఆఫీసర్ వేణుగోపాల్, స్కూల్ బస్సెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ స్వరూప రెడ్డి, ట్రాన్స్ పోర్ట్ డిపార్ట్మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం మోటార్ వెహికల్ ఇన్ స్పెక్టర్ కిషోర్ బాబు అవేర్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది, నాన్ టిచింగ్ సిబ్బంది భాగస్వామ్యమయ్యారు. ఈ సందర్భంగా కిషోర్ బాబు ప్రధానంగా రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు, వాహన వినియోగానికి సంబంధించి ప్రాముఖ్యాన్ని వివరించారు. విద్యార్థులకు రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన పెంచడం అవసరమని, చిన్న వయసులోనే ఈ నైపుణ్యాలు అలవర్చుకుంటే భవిష్యత్తులో ప్రమాదాలను నివారించగలమని ఆయన సూచించారు. హెల్మెట్ ధరించడం, సీటు బెల్ట్ వినియోగం, ట్రాఫిక్ సిగ్నల్స్ అవసరం గురించి వివరించారు. అనంతరం ప్రోగ్రెస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లాడి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మల్లాడి ఆశీష్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ నాగరాజు ముదిరి, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్స్ శ్రావ్య, ఉదయ్ పాఠశాల సిబ్బంది, స్కూల్ బస్ సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తు సంక్రాంతి వేడుకలు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ** : వరంగల్ నగరం కాశిబుగ్గ ప్రాంతంలోని స్టాండర్డ్ ఉన్నత పాఠశాలలో శనివారం పాఠశాల క్రీడా ప్రాంగణంలో బాలికలకు రంగవల్లి పోటీలను నిర్వహించారు. ఇందులో 200 మంది విద్యార్థులు పాల్గొని చక్కని ముగ్గులను వేశారు. పిల్లల్లో డ్రాయింగ్స్ స్కిల్స్ పెంపొందించడానికి, మన సంస్కృతిని తెలియపరచుటకు ముగ్గుల పోటీలు ఉపయోగపడుతాయన్నారు. చదువుతోపాటు సంస్కృతి సాంప్రదాయాలను అలవర్చుకోవాలని ప్రముఖ సైకాలజిస్ట్ కె.రమాదేవి ముఖ్య అతిథిగా పాల్గొని వివరించారు. న్యాయ నిర్ణేతలుగా ఐడీబీఐ బ్యాంక్ మెసేజర్ మమత, దివ్యజ్యోతి, మాధవి, భారతి పాల్గొని విజేతలను ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన రజితను పాఠశాల ప్రిన్సిపాల్ కె.కృష్ణాకర్ రాజు అభినందించారు. కోఆర్డినేటరీ ప్రియాంక, సుమలత, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- ఏసీపీ టి.సత్యనారాయణ
- జాతీయ రోడ్ భద్రతపై అవగాహన




**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలకు చెక్ పెట్టాలని వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ టి.సత్యనారాయణ సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ జా ఆదేశానుసారం ఆర్టీఓ జంక్షన్ సమీపంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కాలేజీలో శనివారం జాతీయ రోడ్ భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ టి.సత్యనారాయణ ట్రాఫిక్ నిబంధనలపై వివరించారు. రోడ్డుపై ప్రయాణించేవారు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. జాగ్రత్తగా వాహనాలు నడపాలని, అందరూ లైసెన్స్ తీసుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమని, అతి వేగంగా వాహనాలు నడిపి కన్నవారికి కడుపుకోత మిగిల్చవద్దని సూచించారు. అదేవిధంగా ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. మీ తల్లిదండ్రులకు, అన్నతమ్ములకు, బంధువులకు రోడ్ సేఫ్టీ విషయంలో తీసుకోవలసిన విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ త్రిబుల్ రైడ్, సెల్ఫోన్ డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలకు గురి కావద్దన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో రోడ్ సేఫ్టీ విషయంలో అతివేగాన్ని నివారించి సురక్షితంగా ప్రయనిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కె.రామకృష్ణ, కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ మమత, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రేఖ, కళాశాల లెక్చరర్స్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.





# నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ బి సాంబశివరావు
- ఫోర్ట్ వరంగల్ యూపీహెచ్ సీ ఆకస్మిక తనిఖీ

**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్ :** ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలని వరంగల్ డీఎంహెచ్ఓ డాక్టర్ బి సాంబశివరావు సూచించారు. ఫోర్ట్ వరంగల్ యూపీహెచ్ సీని ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ప్రజలకు అందించవలసిన సేవలు, సమయపాలన గురించి అడిగి తెలుసుకున్నారు. సాధారణంగా చలికాలంలో చిన్నపిల్లలు, వృద్ధులకు అనారోగ్య సమస్యలు ఎక్కువగా ఉంటాయన్నారు. ముక్కు కారడం, అస్తమ, శ్వాస కోస వ్యాధులు, హార్ట్ ఎటాక్స్, చర్మ సంబంధిత వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ సుధా, డెమో అనిల్ కుమార్, ఏఎన్ఎం రేష్మ, అకౌంటెంట్ అభిషేక్, ఎంఎన్ఓ మాధవ్ సిబ్బంది పాల్గొన్నారు.




# దుప్పట్ల పంపిణీ

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ప్రేమ్ హెల్పింగ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద వృద్ధ మహిళలకు శనివారం దుప్పట్ల పంపిణీ చేశారు. నగరంలో చలి తీవ్రత పెరగడంతో యాచుకులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ సంఘటనను చూసి మనసు చలించి ప్రేమ్ హెల్పింగ్ ట్రస్ట్ చైర్మన్ నర్మెట్ట ప్రేమ్ కుమార్ చేతుల మీదుగా 150 మందికి రగ్గులు, దుప్పట్లు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. గతంలో ఇటువంటి కార్యక్రమాలు ఎన్నో చేశామన్నారు. ఇట్టి కార్యక్రమంలో ట్రస్టు నెంబర్స్ బి.శంకర్, ఎన్.సుగుణ, ఎన్.ఆదిత్య, పోలేపాక గోపి తదితరులు పాల్గొన్నారు.

# ఝాన్సి రెడ్డి దంపతులకు సన్మానం

**వరంగల్ వాయిస్, తొర్రూరు :** తొర్రూర్ పట్టణంలో విద్య, వైద్యం, సామాజిక అంశాలుగా దశాబ్దాలుగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న నియోజకవర్గ నాయకులు డాక్టర్ రాజేందర్ రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా నియోజకవర్గ ఇంచార్జి ఝాన్సీ రాజేందర్ రెడ్డి దంపతులను రాయపర్తి మండల కాంగ్రెస్ నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. వారిని గజమాల, శాలువాలతో సన్మానించి, జ్ఞప్తికలను అందించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తొర్రూర్ బ్లాక్ అధ్యక్షులు జాటోత్ హమ్య నాయక్, పార్టీ మండల అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి, పాలకుర్తి సోమనాథ ఆలయ చైర్మన్ కృష్ణమాచార్యులు, మండల ఉపాధ్యక్షులు భూక్యా సమ్మయ్య, మండల నాయకులు పెండ్లి మహేందర్ రెడ్డి, రెంటల గోవర్ధన్ రెడ్డి, మాందటి సుదర్శన్ రెడ్డి, మాదారపు అశోక్, మద్దెల వెంకన్న, కాంచనపల్లి వనజరాణి, సారంగం, పీరాని ప్రవీణ్, శ్రీను, గోపాల్, దేదావత్ రామ నాయక్, నరసింహుల రామ్మూర్తి, యాకుబ్, రాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా



**వరంగల్ వాయిస్, తొర్రురు :** మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ సభ్యత్వం ఉండి అనివార్య కారణాలతో మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలకు రూ.2 లక్షల ఇన్సూరెన్స్ చెక్కులను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్త ఇబ్బంది పడకూడదన్న ముందు చూపుతో కేసీఆర్ దేశంలోనే మొట్టమొదటిసారిగా కార్యకర్తల కుటుంబాలను ఆదుకోవడంలో భాగంగా వారికి ఇన్సూరెన్స్ కల్పించి అండగా ఉన్న ఏకైక పార్టీగా బీఆర్ఎస్ పార్టీ అన్నారు. తొర్రూరు మండలం జీ కే తండ గ్రామానికి చెందిన అజ్మీర్ కుమార్, వెంకటాపురం గ్రామానికి చెందిన గుండాల నర్సయ్య కుటుంబాలకి శనివారం రూ.2 లక్షల విలువచేసే చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పోనుగోటి సోమేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు పసుమర్తి సీతారాములు, మాజీ జడ్పీటీసీ జిల్లా ఫ్లోర్ లీడర్ మంగళంపల్లి శ్రీనివాస్, వి.రామచంద్రయ్య శర్మ, ఈదురు ఐలయ్య, తొర్రూర్ మండల, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శులు నల మాస ప్రమోద్, కుర్ర శ్రీనివాస్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎన్నమనేని శ్రీనివాసరావు, కాలు నాయక్, మాజీ కోఆప్షన్ ఎస్ కే అంకుష్, రాయిశెట్టి వెంకన్న, కర్నే నాగరాజు, ఫాక్స్ డైరెక్టర్ జనార్దన్ రాజు, లేగల వెంకటరెడ్డి, చకిలేలా మణిరాజ్, మయూరి వెంకన్న, తూర్పాటి రవి, ఆశయ గుగులోత్ రమేష్, జాటోత్ సురేశ్, భూక్యా అరుణ్, చెట్టుపల్లి సోమయ్య, వెంకటాపురం గ్రామ మాజీ సర్పంచ్ శ్రీలం లింగన్న గౌడ్, వీరారెడ్డి, రాంబాబు గుండాల రంజిత్, భానోత్ అశోక్, తొర్రూర్ బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు యర్రం రాజు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను ఆశీర్వదించిన ఎర్రబెల్లి.. తొర్రురు పట్టణ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ హనుమండ్ల ప్రదీప్ రెడ్డి కూతురి నూతన వస్త్రాలంకరణ నాంచారి మాదూరు రెడ్డి గార్డెన్ లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు.




# విద్యపై ప్రత్యేక దృష్టి : ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**వరంగల్ వాయిస్, టేకుమట్ల :** ప్రజా ప్రభుత్వం విద్యపై ప్రత్యేక దృష్టి సారిస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం జిల్లా అధికారులతో కలిసి ఆయన టేకుమట్ల మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థులకు బ్లాంకెట్స్, బెడ్ షీట్స్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో మెస్, డైట్ చార్జీలు ఏనాడు పెంచలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, మండల స్పెషల్ అధికారి శైలజ, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో అనిత, మండల పార్టీ అధ్యక్షుడు కోటగిరి సతీష్ గౌడ్, మాజీ జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి, కత్తి సంపత్, మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, డైరెక్టర్లు లింగంపల్లి కిరణ్ రావు, కనుమరుగుల సంపత్, బండ శ్రీకాంత్, కొయ్యల చిరంజీవి, సదానందం, రాజమౌళి, తోడేటి కుమార్, గంధం సారయ్య తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ సినిమా
శనివారం 04 జనవరి 2025




# కోటి రూపాయలు అడిగినా ఇస్తాను, కాని అవి మాత్రం ఇవ్వను : పవన్‌కళ్యాణ్

విజయవాడలోని ఇందిరాగాంధీ మైదానంలో 35వ బుక్ ఫెస్టివల్ ప్రారంభమయిన విషయం తెలిసిందే. ఈ బుక్ ఫెస్టివల్‌ను ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జనవరి 2న సాయంత్రం లాంఛనంగా ప్రారంభించారు. 234 స్టాళ్లతో అనేకమంది ప్రచురణకర్తలు ఈ మహోత్సవంలో పాల్గొననున్నారు. సాహితీ నవజీవన్ బుక్ లింక్స్ అధినేత పిడికిలి రామకోటేశ్వరరావు పేరును ఈ బుక్ ఫెస్టివల్ ప్రాంగణానికి పెట్టారు. ప్రధాన సాహితీవేదికకు ఈనాడు అధినేత దివంగత రామోజీరావు పేరు పెట్టారు. విద్యార్థుల కార్యక్రమాలు జరిగే ప్రతిభా వేదికకు దివంగత పారిశ్రామిక వేత్త రతన్ టాటాపేరు పెట్టారు. ఈ పుస్తక మహోత్సవం 2వ తేదీనుంచి 12వ తేదీ వరకు జరుగనున్నాయి. అయితే ఈ బుక్ ఫెస్టివల్‌లో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. కోటి రూపాయలు అయిన ఇవ్వడానికి వెనుకాడను కానీ నా దగ్గర పుస్తకాలు ఉన్న ఇవ్వడానికి ఆలోచిస్తాను. పుస్తకాన్ని ఇవ్వాలి అంటే నా సంపదను ఇచ్చినట్లే అని నాకు అనిపిస్తుంది. కర్ణుడు కవచ కుండలాలను కోసేస్తే ఎలా బాధ పడుతాడో తెలీదు కానీ.. నా పుస్తకం ఇవ్వాలంటే కింద, మీద పడిపోతాను అంత మమకారం పుస్తకాలు అంటే అని పవన్ చెప్పుకోచ్చాడు. పుస్తక పఠనం లేకపోతే నేను ఏలా ఉండేవాడినో అనిపిస్తది. నేను ఇంటర్ కూడా ఎందుకు ఆపేశాను అంటే నేను కోరుకుంటున్న చదువు పుస్తకాల్లో, క్లాస్ రూంలో లేదు అందుకే ఇంటర్ ఆపేశాను. రవీంద్రనాథ్ ఠాగూర్ స్కూలుకి వెళ్లకుండా ఇంట్లోనే కూర్చొని చదువుకున్నాడు.. నేను ఠాగూర్ గారి ప్రేరణతో ఆయన లాగే చెట్లు, మొక్కలు చూస్తూ పుస్తకాలు పెట్టుకొని ఉండిపోయాను అంటూ పవన్ కళ్యాణ్ చెప్పుకోచ్చాడు.

# మా నాన్న బంగారం

హీరోయిన్ కీర్తి సురేశ్ ఇటీవల తన చిరకాల మిత్రుడు ఆంటోనిని పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. హిందూ, క్రిస్టియన్ సంప్రదాయాల్లో వీరిద్దరి పెళ్లి జరిగింది. 15 ఏళ్ల ప్రేమకథను రోజుకో ఎపిసోడ్‌లాగా కీర్తి పంచుకుంటున్నారు. బేబీజాన్ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పెళ్లి విశేషాలను పంచుకున్నారు. ముఖ్యంగా క్రిస్టియన్ పద్ధతి గురించి మాట్లాడుతూ.. ఆంటోనీ కుటుంబ ఆచారాలకు అనుగుణంగా ఆ సంప్రదాయం లో పెళ్లి చేసుకున్నామన్నారు. ‘‘క్రిస్టియన్ సంప్రదాయంలోనూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాక మా నాన్నతో మాట్లాడాను. ‘నాన్నా.. ఈ సంప్రదాయం ప్రకారం వధువును ఆమె తండ్రి పెళ్లి వేదిక పైకి తీసుకురావాలి. నా కోసం మీరు కూడా ఆ విధంగా చేస్తారా?’ అని అడిగా. ‘తప్పకుండా చేస్తాను. మనం రెండు సంప్రదాయాల్లో వివాహం జరుపుతున్నాం. కాబట్టి నేను కూడా ఆ పద్ధతులు పాటిస్తాను’ అని ఆయన బదులిచ్చారు. ఆ మాట నాకెంతో సంతోషాన్ని ఇచ్చింది. నేను చెప్పిన దానికి ఆయన అంగీకరిస్తారని అసలు ఊహించలేదు. కానీ ఆయన నా కోసం ఆ విధంగా చేయడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది’’ అని కీర్తి సురేశ్ తెలిపారు. ఇటీవల బేబీజాన్ ఈవెంట్‌కు వెళ్లిన ఆమె పసుపుతాడు (మంగళసూత్రం)తో హాజరు కావడంపై ఆమె స్పందించారు. ‘‘దక్షిణాదిలో ఒక సంప్రదాయం ఉంది. పెళ్లి సమయంలో వధువు మెడలో వరుడు పసుపుతాడు కడతాడు. దానిని మేమెంతో పవిత్రంగా భావిస్తాం. పెళ్లైన కొన్ని రోజులకు ఒక మంచి ముహూర్తం చూసి మంగళ సూత్రాలను బంగారు చైన్‌లోకి మార్చుకుంటాం. జనవరి చివరివరకూ మంచి రోజులు లేవు. అప్పటివరకూ నేను ఎక్కడికి వెళ్లినా పసుపు తాడు తో కనిపిస్తాను’’ అని తెలిపారు.



# శృంగారంచేయకండి

**చిన్మయి శ్రీపాద**

చిన్మయి శ్రీపాద.. ఈ పేరు అంటేనే కొంతమందికి హడల్, మరికొందరికి కోపం, చిరాకు ఇంకొందరికి ప్రేమ, అభిమానం. ఈ అభిప్రాయాలన్ని కేవలం ఆమె కళ సృజనాత్మకత గురించి మాత్రమే కాదు. ఆమె తనకంటూ ఒక అభిప్రాయం, స్టాండ్, పర్సనాలీటీని క్రియేట్ చేసుకున్నాక చాలా మందికి కంటి మీద నిద్ర లేకుండా చేస్తోంది. బహిరంగంగాను, సోషల్ మీడియా ద్వారాను ఆమె సొసైటీలో మహిళలు పేస్ చేస్తున్న సమస్యలపై పోరాటం చేస్తుంటుంది. తాజాగా ఓ నెటిజన్ చేసిన ట్వీట్ కి దిమ్మదిరిగిపోయే కౌంటర్ ఇచ్చి మరోసారి వార్తల్లో నిలిచింది. ఇంతకీ ఏం జరిగిందంటే.. 2024 సంవత్సరం పూర్తికావడంతో చాలా సంస్థలు వాళ్ళ సేల్స్, అచీవ్ మెంట్స్ తదితర అంశాలని షేర్ చేశాయి. ఈ నేపథ్యంలోనే.. ప్రముఖ హోమ్ డెలివరీ గ్రోసరీస్ సంస్థ బ్లింక్ ఇట్ సీఈఓ ఒక్క రోజులోనే తమ యాప్ ద్వారా లక్షకు పైగా కండోమ్స్ సేల్ చేసినట్లు ట్వీట్ చేశారు. ఈ క్రమంలోనే ఓ నెటిజెన్.. ఇలా అయితే వర్జిన్ అమ్మాయిలు భార్యలుగా దొరకడం కష్టమే.. అంటూ ట్వీట్ చేశాడు. దీనికి చిన్మయి స్పందిస్తూ.. ‘‘మగాళ్లు పెళ్ళికి ముందు అమ్మాయిలతో శృంగారం చేయడం ఆపండి. మీ అన్నదమ్ముల్ని, ఫ్రెండ్స్ ని పెళ్లి అయ్యేదాకా అలాంటి పని చేయొద్దని చెప్పండి’’ అంటూ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. దీంతో ఈ వార్త తెగ వైరల్ అవుతోంది. మీటూ మూవ్‌మెంట్‌లో భాగంగా ప్రముఖ తమిళ గేయ రచయిత వైరముత్తు, పలువురు ఇండస్ట్రీకి చెందిన ప్రముఖులపై ఆమె సంచలన కామెంట్స్ చేశారు. ఎందరో మహిళలలకు ఆమె అండగా నిలుస్తూ పోరాటం చేస్తున్నారు.





# డిఫరెంట్ అవతారాల్లో రాంచరణ్

గ్లోబల్ స్టార్ రాంచరణ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం గేమ్‌ఛేంజర్. శంకర్ దర్శకత్వం వహిస్తున్నాడు. బాలీవుడ్ భామ కియారా అద్వానీ, రాజోలు భామ అంజలి ఫీ మేల్ లీడ్ రోల్స్ పోషిస్తున్న ఈ మూవీ జనవరి 10న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో భాగంగా గేమ్ ఛేంజర్ ట్రైలర్‌ను లాంచ్ చేయగా నెట్టింట మిలియన్ల సంఖ్యలో వ్యూస్‌తో దూసుకెళ్తోంది. ఈవెంట్‌లో శంకర్ మాట్లాడుతూ.. సినిమాలో రాంచరణ్ అద్భుతంగా నటించాడు. సినిమాలో మీరు స్టార్‌ను కాదు.. పాత్రను మాత్రమే చూస్తారు. రాంచరణ్ స్క్రీన్ ప్రెజెన్స్ కోసమే జనాలు థియేటర్లకు వస్తారని భావిస్తున్నాను. చరణ్ ప్రతీ ఫ్రేమ్‌లోనూ అద్భుతంగా కనిపిస్తున్నాడు. రాంచరణ్ డిఫరెంట్ అవతారాల్లో కనిపించనున్నాడు. గేమ్‌ఛేంజర్‌లో ఐఏఎస్ పాత్ర కోసం గడ్డం లేని చిన్న హెయిర్‌స్టైల్‌ని కోరుకున్నాము. నేను అడిగిన ప్రతీ విషయాన్ని చేయడానికి చరణ్ ఒప్పుకున్నాడు. ఇక అప్పన్న పాత్ర గేమ్ ఛేంజర్‌కు గుండెకాయలాంటిది. కడుపునిండా వంద ముద్దలు తిన్న ఏనుగు ఒక ముద్ద వదిలిపెడితే పెద్దగా దానికొచ్చే నష్టమేం లేదు. కానీ అది లక్ష చీమలకు ఆహారం నేను మిమ్మల్ని అడిగేది కూడా కేవలం ఆ ఒక్క ముద్ద మాత్రమే.. మా పార్టీ సేవ చేయడానికే కానీ సంపాదించడానికి కాదంటూ ట్రైలర్‌లో వచ్చే డైలాగ్స్ అందరినీ ఆలోచింపజేసేలా సాగుతూ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాయి.

# 12 ఏళ్లకు థియోటర్లలోకి..

తెలుగు, తమిళ ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని యాక్టర్ విశాల్. బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్న విశాల్‌కు సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి బయటకు వచ్చింది. విశాల్ నటించిన చిత్రాల్లో ఒకటి మదగజరాజ. యాక్షన్ కామెడీ బ్యాక్ డ్రాప్‌లో వచ్చిన ఈ చిత్రాన్ని సుందర్ సీ డైరెక్ట్ చేశాడు. అంజలి, వరలక్ష్మి శరత్‌కుమార్ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటించగా.. సంతానం, సోనూసూద్ కీలక పాత్రల్లో నటించారు. 2013 పొంగళ్ కానుకగా జనవరిలోనే విడుదల కావాల్సిన ఈ సినిమా పలు కారణాలతో వాయిదా పడ్డది. 12 ఏండ్ల లాంగ్ గ్యాప్ తర్వాత థియేటర్లలో సందడి చేసేందుకు రెడీ అయింది. జెమినీ ఫిల్మ్ సర్క్యూట్ తెరకెక్కించిన ఈ చిత్రం జనవరి 12న గ్రాండ్‌గా విడుదల కానుంది. అజిత్‌కుమార్ నటించిన విదాముయార్చి సంక్రాంతి బరిలో నుంచి తప్పుకోవడంతో విశాల్ టీం ఈ నిర్ణయం తీసుకుందట. ఈ చిత్రానికి విజయ్ ఆంటోనీ సంగీతం అందించాడు. మరి దశాబ్ధం తర్వాత థియేటర్లలోకి వస్తున్న ఈ సినిమాకు ఎలాంటి స్పందన వస్తుందనేది చూడాలి.



# శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

**కలెక్టర్ ప్రావీణ్య**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ట్రైనింగ్ విషయంలో అధికారులు చెప్పినట్టు, ఏ విధమైన సమస్యలు తెలత్తకుండ, పూర్తి అవగాహనతో ఉండాలని అన్ని డిపాజిట్లు, ఆర్థికపరమైన అంశాలపై అవగాహన కలిగి ఉండాలని అధికారులకు జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రామీణ పేదరిక నిర్మూలణ సంస్థ (సెర్ప్) సీసీలు, ఏపీఎంలు, డీపీఎంలు, జడ్ఎస్ఈసీ సభ్యులకు గ్రామ సంఘం వీవో, మండల సమాఖ్య ఎంఎంఎస్, జిల్లా సమాఖ్య జడ్ఎస్ ఉప విధులు నిబంధనావళి, ఆర్థిక నియమాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శాయంపేట మండలంలో చాలా తక్కువ స్థాయిలో చిన్న స్థాయి వ్యాపారులు, మహిళలకి సంబంధించిన వ్యాపారాలు ఎందుకు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. వచ్చే సమావేశంలో పూర్తి స్థాయిలో తమ వ్యాపారాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి జిల్లా, మండల, ఆర్పీ అధికారులు తమ పెట్టుబడుల ద్వారా పెట్టిన వ్యాపారాలు ఎలా ఉందో తనిఖీ చెయ్యాలని కోరారు. రాబడుల గురించి ప్రతి రిపోర్ట్ బద్రపరుచుకునేల చర్యలు తీసుకోవాలన్నారు. వారి ప్రతి వ్యాపార కేంద్రాలను సందర్శించి వ్యాపార సలహా, సూచనలు ఇవ్వాలని కోరారు. ప్రతి మండలంలో ఇందిరా మహిళా శక్తి పథకం కింద సోలార్ పవర్ ప్రాజెక్ట్, మండలానికి 350 మందిని ఎంపిక చేసి కుట్టు మిషన్ ట్రైనింగ్ సెంటర్లు నిర్వహించాలని సూచించారు. డబ్ల్యూఈ –హబ్ గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అందులో తమ వ్యాపారం ఎలా అభివృద్ధి పథంలో నడపాలో ట్రైనింగ్ తీసుకోవాలన్నారు. తద్వారా మంచి లాభాలు పొందేలా చూడాలని వివరించారు. శిక్షణ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎం.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పౌరుడికి న్యాయం అందాలి






- న్యాయ సేవాధికార సంస్థల విధులపై అవగాహన కల్పించాలి
- ఇంఛార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.అపర్ణా దేవి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రతి పౌరుడికి న్యాయం అందాలని, ఇందుకు న్యాయ సేవాధికార సంస్థల విధులపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఇంఛార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.అపర్ణా దేవి సూచించారు. శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, వరంగల్, హనుమకొండ జిల్లాల కార్యదర్శులు ఎం.సాయి కుమార్, క్షమా దేశ్ పాండేల అధ్యక్షతన పానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్ల రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొదటి రోజున 'జాతీయ న్యాయ సేవాధికార సంస్థ యొక్క నాల్సా (మానసిక అనారోగ్యం, మేధో వైకల్యాలున్న వ్యక్తులకు చట్టపరమైన సేవలు) పథకం–2024' పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హనుమకొండ జిల్లా ఇంఛార్జి ప్రధాన న్యాయమూర్తి బి.అపర్ణా దేవి పాల్గొని ప్రసంగించారు. ప్రజలకు, న్యాయ సేవాధికార సంస్థలకు వారధిగా నడుచుకోవాలని సూచించారు. న్యాయ సేవాధికార సంస్థల విధులను, లక్ష్యాలను ప్రజలకు తెలియజెప్పి, ఏ పౌరుడూ న్యాయాన్ని కోల్పోకుండా బాధ్యత తీసుకోవాలని తెలిపారు. మానసిక అనారోగ్యం, మేధో వైకల్యం ఉన్న వ్యక్తులకు చట్టపరమైన సేవలు అందుబాటులో ఉన్నాయని ప్యానల్ లాయర్లు, పారా లీగల్ వాలంటీర్లు వాటిని క్షుణ్ణంగా తెలుసుకొని ప్రజలకు ఉపయోగపడాలని తెలిపారు. వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, వరంగల్ కార్యదర్శి ఎం.సాయి కుమార్ నాల్సా పథకం యొక్క విధి విధానాలను, దీనిలో భాగంగా సంబంధికులు నిర్వర్తించాల్సిన విధులను వివరించడం జరిగింది. ఈ శిక్షణా కార్యక్రమంలో హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కార్యదర్శి క్షమాదేశ్ పాండే, ట్రైనర్లు ఛీఫ్ లీగల్ ఏయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఆర్.సురేష్, డిప్యూటి లీగల్ ఏయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.శ్రీనివాస రావు పాల్గొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో వరంగల్ జిల్లాకు చెందిన పానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# నమ్మించి నట్టేట ముంచిన కాంగ్రెస్

- జాబ్ క్యాలెండర్ అంటూ మోసం
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ నేతలు నమ్మించి నట్టేట ముంచారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి ఆరోపించారు. జాబ్ క్యాలండర్ అని ప్రకటించి జాబ్ లెస్ క్యాలెండర్ విడుదల చేశారన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన జాబ్ క్యాలెండర్ లో పండగలు, పబ్బాలు, పంచాంగం తప్ప ఎక్కడా ఉద్యోగ నియామకాల ఊసే లేదని మండిపడ్డారు. మైసూరు బజ్జీలో మైసూరు లేకున్నా కనీసం బజ్జీ ఉంటుంది..బొంబాయి రవ్వలో బొంబాయి లేకున్నా రవ్వ అయినా ఉంటుంది.. కానీ, కాంగ్రెస్ ఇచ్చిన జాబ్ క్యాలెండర్ లో జాబు లేదు, క్యాలండర్ లేదని ఎద్దేవా చేశారు. చంద్రబాబును ఆదర్శంగా తీసుకుంటున్న రేవంత్ రెడ్డి మరి జాబ్ క్యాలెండర్ విషయంతో ఎందుకు పాటించడం లేదని ప్రశ్నించారు. జీవో 46, జీవో 29 బాధితులపై ప్రభుత్వం కక్ష కట్టి కోట్లు ఖర్చు పెట్టి కేసులు వాదిస్తూ తీవ్ర అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. 2025 లో అయినా జాబ్ లతో కూడిన జాబ్ క్యాలెండర్ విడుదల చెయాలని సూచించారు. వీఆర్వోలను తీసుకొచ్చి సర్వేయర్లుగా సర్వేలు చేయించడం బుద్ధి తక్కువ పని అన్నారు. సర్వేయర్ పని సర్వేయర్ చేయాలి వీఆర్ఓ పని వీఆర్వో చేయాలి అన్నారు. 12 వేల వీఆర్వో ఉద్యోగాలకు తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సర్వేయర్ పోస్టులను బీటెక్ సివిల్, సివిల్ డిప్లమా చేసిన వారితో భర్తీ చెయాలన్నారు. ఏఈ ఉద్యోగాలకు సర్టిఫికెట్స్ తనిఖీ కూడా అయింది కానీ, ఇప్పటి వరకు అపాయింట్మెంట్ ఇవ్వలేదన్నారు. ఈ ఏడాది కూడా నోటిఫికేషన్ ఇవ్వకపోతే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యువత మీకు బుద్ధి చెప్పడం ఖాయంమని హెచ్చరించారు.



# ముక్కోటికి ఉత్తర ద్వార దర్శనం 'పవిత్రం'

ఈ ఏడాది ముక్కోటి ఏకాదశి జనవరి 10న వచ్చింది. ఆరోజు ప్రతి దేవాలయంలో ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేస్తారు. అంతే కాదు దగ్గరలో పుణ్య నదులు ఉంటే వాటిలో స్నానమాచరిస్తారు. అలా చేస్తే కోటి పుణ్యాల ఫలం దక్కుతుందని పురాణాలు చెబుతున్నాయి. సూర్య భగవానుడు మకరరాశిలోకి ప్రవేశించిన తరువాత మకర సంక్రమణం మధ్యలో ముక్కోటి ఏకాదశి వస్తుంది. ఉత్తరాయణ పుణ్య కాలానికి ముందు వచ్చే ఏకాదశిని ముక్కోటి ఏకాదశి అని, దీనినే వైకుంఠ ఏకాదశి అని కూడా అంటారు. ముక్కోటి ఏకాదశి రోజున వేకువజామునే లేచి, తలంటు స్నానం చేసి.. ఉత్తర ద్వారం గుండా వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం సాంప్రదాయంగా వస్తోంది. హిందువులు ఆధ్యాత్మికమైన విషయాల్లో చాలా శ్రద్ధ చూపుతారు. పండుగలకు.. విశేషమైన రోజులలో ప్రత్యేకమైన పూజలు నిర్వహిస్తారు. పురాణాల ప్రకారం మహావిష్ణువు గరుడ వాహనంపై మూడు కోట్ల దేవతలతో భూలోకానికి వచ్చి భక్తుల కోర్కెలను తీరుస్తారు. అందుకే ఈ ఏకాదశిని ముక్కోటి ఏకాదశి అంటారు. ఈ ఒక్క ఏకాదశి మూడు కోట్ల ఏకాదశులతో సమానమని పండితులు చెబుతారు. క్షీర సముద్రాన్ని మధించేప్పుడు.. ఈ రోజునే హాలాహలం.. అమృతం పుట్టాయని ఆధ్యాత్మిక గ్రంథాల ద్వారా తెలుస్తోంది. పరమేశ్వరుడు.. హాలాహలం మింగి కంఠం దగ్గర ఉంచుకోగా.. అమృతాన్ని దేవతలు అందరూ పంచుకున్నారు. అప్పటి నుంచి పరమేశ్వరుడిని నీలకంఠేశ్వరుడు అని కూడా పిలవడం మొదలు పెట్టారు. విష్ణు పురాణం ప్రకారం.. మహా విష్ణువు ఆ రోజున వైకుంఠ ద్వారాలను తెరిచాడని పండితులు చెబుతున్నారు. ఇద్దరు రాక్షసులు.. మహా విష్ణువును దర్శించుకొనేందుకు ఎంతో కాలంగా ఆ ద్వారాల దగ్గర వేచి ఉన్నారట. ఆ రాక్షసులు పూర్వ జన్మలో చేసిన పాపాల వలన రాక్షసులుగా జన్మించారు. ఆ రాక్షసులు తమ పాపాలను నివృత్తి చేసి.. వైకుంఠ ప్రవేశం కల్పించాలని విష్ణుమూర్తిని కోరారు. అప్పుడు పుష్యమాసం ఏకాదశి రోజున వైకుంఠ ద్వారం తెరిచి.. వారికి ముక్తిని ప్రసాదించాడట. అందుకే ముక్కోటి ఏకాదశి రోజున వైకుంఠ ద్వారాన్ని తలపించే విధంగా వైష్ణవ ఆలయాల్లో ద్వారాలను ఏర్పాటు చేయడం పరిపాటిగా మారింది.



# 200 పేర్లు గల్లంతు

- ప్రజా పాలనలో దరఖాస్తు చేసినా యాప్ లో మాయం
- కార్పొరేటర్ మరుపల్ల రవి

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి ప్రజా పాలనలో ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్నా యాప్ లో 200 మంది అర్హుల పేర్లు గల్లంతయ్యాయని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి ఆరోపించారు. దీంతో నిరుపేదలు అయోమయానికి గురవుతున్నారన్నారు. దరఖాస్తు చేసినా పేర్లు మాయం కావడంపై రవి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా దరఖాస్తు పెట్టుకున్న వారిని గుర్తించి, వారి స్థితి గతులను పరిశీలించి ఇంటి నిర్మాణానికి ఋణం మంజూరు చేయాలని బల్దియా కమిషనర్ తోపాటు సంబంధిత అధికారులను కార్పొరేటర్ మరుపల్ల రవి కోరారు. నిరుపేద లబ్ధిదారుల నుంచి ప్రజాపాలన లో చేసిన దరఖాస్తు రశీదును మహానగర పాలక సంస్థలో అంద చేస్తానని లబ్ధిదారులకు ఆయన హామీ ఇచ్చారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com